


లోకసభ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌ను మానసికంగా దెబ్బ తీయాలనే రాజకీయ కుట్రతో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సమయంలో అరెస్టు చేయడం పూర్తిగా అప్రజాస్వామిక చర్య. కవిత అరెస్టుపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలి.

-కడియం శ్రీహరి, మాజీ డిప్యూటీ సీఎం



# భగ్గుమన్న మహిళాలోకం

## మోదీకి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు

## ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అరెస్ట్‌పై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. శుక్రవారం రాత్రి ఆమె అరెస్ట్ వార్త తెలియగానే పార్టీ శ్రేణులతోపాటు మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోదీ డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేసి, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. భువనగిరి పట్టణంలో ప్రిన్స్ కార్నర్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి ప్రధాని దిష్టి బొమ్మను దహనం చేశారు. కవిత అక్రమ అరెస్ట్‌ను ఖండించారు. విచారణ జరుగుతున్న సమయంలో ఎలా అరెస్ట్ చేస్తారంటూ మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగామ క్రాస్‌రోడ్‌లో రాస్తారోకో చేశారు. రాజ్యాంగబద్ధ సంస్థలన్నింటినీ కేంద్రం దుర్వినియోగం చేస్తున్నదని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. దేవరకొండలో రాస్తారోకో నిర్వహించారు. జగిత్యాలలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టగా, మెట్‌పల్లిలో బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా, నిరసనలో పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం ఎన్టీఆర్ చౌరస్తా, జనగామ జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొని నిరసన తెలిపారు.

# మోదీవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

- బీజేపీ కుట్ర.. కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, మార్చి15 (నమస్తే తెలంగాణ)/నాగర్‌కర్నూల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అక్రమమని, ముమ్మాటికీ ఇది అప్రజాస్వామికమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఇది బీజేపీ కుట్రలో భాగమని, కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందంతో ఆమెను అరెస్టు చేసిందని విమర్శించారు. కవిత అరెస్టును బీఎస్పీ తీవ్రంగా ఖండిస్తున్నదని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈడీనీ అడ్డు పెట్టుకొని కవితను అరెస్టు చేసిందని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ కుటిల ఎత్తుగడలకు తలొగ్గకుండా, బీఎస్పీతో చేతులు కలిపిన కొన్నిగంటల్లోనే మోదీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరతీశాడని ధ్వజమెత్తారు. ఈ చర్య తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై దెబ్బకొట్టడం తప్ప మరొకటి కాదని తెలిపారు. దేశంలో మోదీ పాలన నాజీల నియంతృత్వంకన్నా ఘోరంగా ఉన్నదని ధ్వజమెత్తారు. ప్రొఫెసర్ సాయిబాబా, సిసోడియా, ఇటీవల హేమంత్ సోరెన్, నేడు కల్వకుంట్ల కవిత, రేపు నువ్వో నేనో? అని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం కాదు.. యావత్తు దేశం బీజేపీని తక్షణమే తిరస్కరించాల్సిన అవసరమున్నదని కోరారు.

**బడేభాయ్.. చోటేభాయ్..**

రాజ్యాంగం ఇచ్చిన హక్కులన్నీ ప్రమాదంలో ఉన్నాయని ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బడేభాయ్.. చోటేభాయ్‌లా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన కాన్షీరాం 90వ జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలో కేంద్రం దేశాన్ని పూర్తిగా దోచుకున్నదని, ఆస్తులను, సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టిందని ధ్వజమెత్తారు. బీజేపీ పాలనను ప్రశ్నించే వారిపై ఏసీబీ, ఈడీ దాడులు అంటూ వారి నోళ్లను మూయిస్తున్నారని మండిపడ్డారు.

# మోదీ వెంటే ఈడీ!

## ప్రధాని పర్యటనల సమయంలోనే దాడులు

- బీజేపీయేతర రాష్ట్రాల్లో ఎప్పుడూ ఇదే తంతు
- ఇప్పుడు మల్కాజిగిరిలో మోదీ రోడ్ షో జరుగుతుండగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి విడదీయలేని బంధం ఉన్నది. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో మోదీ పర్యటిస్తున్నారంటే.. ఆయన వచ్చే ముందో, ఆ తర్వాతో కచ్చితంగా ఆ రాష్ట్రంలో ఐటీ, ఈడీ, సీబీఐ లాంటి జాతీయ దర్యాప్తు సంస్థలు దాడులు చేయడం, ఆయా రాష్ట్రాల్లోని అధికార పార్టీ నేతలను లేదా బీజేపీని విమర్శిస్తున్న నేతలను, వారికి అండగా నిలుస్తున్న సంస్థలపై దాడులు చేయడం పరిపాటిగా మారింది. ఇప్పుడు తెలంగాణలో జరిగింది కూడా ఇదే. మల్కాజిగిరి నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించేందుకు మోదీ శుక్రవారం తెలంగాణకు రాకముందే ఈడీ అధికారులు వాలిపోయారు. ఆ రోడ్‌షో ముగిసేలోగా కవితను అరెస్ట్ చేశారు. బీజేపీయేతర రాష్ట్రాలన్నింటిలోనూ ఇదే తంతు కొనసాగుతున్నది. మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటనల సమయంలోనూ కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేయడం సర్వసాధారణంగా మారింది.

- 2022 ఫిబ్రవరి 5న హైదరాబాద్‌లో రామానుజాచార్యుల విగ్రహావిష్కరణకు మోదీ వచ్చారు. మరుసటి రోజే తెలంగాణ, ఏపీలోని దాదాపు 40 ప్రాంతాల్లో ఐటీ దాడులు జరిగాయి. రియల్‌ఎస్టేట్ సంస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి.
- అదే ఏడాది జూలై 1 నుంచి 3 వరకు జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో మోదీ పాల్గొన్నారు. 3న బీఆర్‌ఎస్ ఎంపీ నామా నాగేశ్వర్‌రావుకు చెందిన దాదాపు రూ.88 కోట్ల ఆస్తులను ఐటీ శాఖ జప్తు చేసింది.
- 2022 నవంబర్ 12న మోదీ రామగుండానికి వచ్చారు. అంతకుముందే.. 9వ తేదీన అప్పటి మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇండ్లపై ఈడీ దాడులు చేసింది. లిక్కర్ స్కాం పేరుతో అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్‌చంద్రారెడ్డిని అరెస్ట్ చేసింది.
- 2023 మార్చి 11న అమిత్‌షా తెలంగాణ పర్యటనకు వచ్చారు. అదేరోజు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ విచారించింది.
- ఏప్రిల్ 8న మోదీ తెలంగాణలో పర్యటించారు. అదే నెల 2న రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ కంపెనీల్లో ఈడీ సోదాలు చేసింది.
- జూన్ 14న అమిత్ షా రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. అదేరోజు ఐటీశాఖ రంగంలోకి దిగింది. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల సంస్థలు, వాటి కార్యాలయాలయాలపై దాడులు చేసింది
- ఆగస్టు 6న మోదీ హైదరాబాద్‌కు వచ్చారు. అదే నెల 1న నగరంలో ఈడీ సోదాలు జరిగాయి.
- అక్టోబర్ మొదటి వారంలో మోదీ తెలంగాణలో పర్యటించారు. అదే సమయంలో ఈడీ డ్రగ్స్ కేసులో సినీ నటులను విచారించింది.



శుక్రవారం తన అరెస్ట్ సందర్భంగా పోరాట చిహ్నం పిడికిలి బిగించి పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఆమె కుమారుడు



## విడుదల చేయకపోతే ఆమరణదీక్ష

- ఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను తెలంగాణ సమాజం మీద జరిగిన దాడిగానే భావిస్తున్నామని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డ, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక కవితను విడుదల చేయకపోతే ఆమరణదీక్ష చేపడతానని హెచ్చరించారు.

# సీఎం పోస్టు ఆఫర్!

- ఆప్ కీలక నేత మనీశ్ సిసోడియాకు సీబీఐ వల
- బీజేపీ కుట్రను అప్పుడే బయట పెట్టిన సిసోడియా
- అందుకే, ఏడాది గడిచినా ఇంకా జైల్లోనే..!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఆయన పేరు మనీశ్ సిసోడియా. ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి. కేజ్రీవాల్ తర్వాత ఆమ్‌ఆద్మీ పార్టీలో రెండో కీలక నేత. ఢిల్లీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బస్తీ దవాఖానలు, సర్కారు బడుల్లో నాణ్యత ప్రమాణాల పెంపు, ట్రాఫిక్ ఇబ్బందులకు పరిష్కారం వంటి నిర్ణయాల్లో సిసోడియాది ప్రధాన పాత్ర. నూతన మద్యం పాలసీలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ సిసోడియాను పలుమార్లు విచారించిన సీబీఐ.. 2023, ఫిబ్రవరి 26న అరెస్టు చేసింది. అప్పటినుంచి ఆయన జైలు జీవితాన్నే గడుపుతున్నారు. విచారణ సమయంలో సీఎం పదవిని ఆశజూపి ఆప్‌ను లొంగదీసుకొనేందుకు బీజేపీ కుట్రకు తెర తీసిందని అరెస్టుకు ముందు సిసోడియా ఆరోపించారు. ఆప్‌ను వీడాలని సీబీఐ అధికారులు తనపై ఒత్తిడి చేశారని 2022 అక్టోబర్ 17న సిసోడియా తెలిపారు. బీజేపీలోకి వస్తే, ఢిల్లీ సీఎం పోస్టు ఇస్తామని ఆఫర్ చేశారని, లేకుంటే జైలుకు పంపిస్తామని బెదిరించారని పేర్కొన్నారు. ఏడాదికి పైగా జైలు జీవితాన్ని అనుభవిస్తున్నా, బీజేపీ బెదిరింపులకు వెరవకుండా సిసోడియా కోర్టుల్లో తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.


